క్లుప్తంగా

ముగిసిన ఆశ్రమ వార్షికోత్సవాలు



పూర్ణాహుతి ద్రవ్యాలను యాగ గుండానికి సమర్పిస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : స్థానిక కుందూనది ఒడ్డున వెలిసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ఏకవిశ్రాంత వేడుకలు నిర్వహించి పూర్ణాహుతి గావించడంతో ఉత్సవాలు ముగిశాయి. శ్రీ యోగానంద సరస్వతి మాతాజీ, సుప్రేమానంద మాతాజీ, శ్రీ స్వామి ఆత్మవిద్యానంద సరస్వతి మాతాజీ పాల్గొని భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. పూర్ణాహుతిలో ఎస్‌వి సత్యనారాయణ దంపతులు, బుడ్డా విష్ణు వర్ధన్‌రెడ్డి దంపతులు, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు మహనందీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి'లో రోజువారీ వేతనం రూ. 272

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనే కూలీలకు ప్రభుత్వం రోజువారి వేతనం రూ. 272కు పెంచిందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రథమ చికిత్స బాక్స్‌లను అందజేసి మాట్లాడారు. మండలంలో రోజు వారిగా పనుల్లో 2,500మంది కూలీలు పాల్గొనేలా చూడాలనే లక్ష్యంగా కేటాయించారని, అయితే కేవలం 780 మంది మాత్రమే కూలీలు పనుల్లో పాల్గొంటున్నారని ఆ శాఖ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో జరుగుతున్న పదో పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ బృందం గురువారం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ చాగలమర్రి, ఉయ్యాలవాడ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశామని చెప్పారు. స్థానిక మోడల్‌స్కూల్‌లో హిందీ పరీక్షకు 180 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 17 6 మంది హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 175కు గాను 175 మంది హాజరయినట్లు చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారులు నూర్జహాన్, వెంకట శకుంతల, దస్త గిరిరెడ్డి తెలిపారు.

శిరివెళ్ల: పదో తరగతి పరీక్షల నిర్వహణను గురువారం డీఈఓ అనురాధ తనిఖీ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బంది వద్ద సెల్‌ఫోన్లపై ఆరా తీశారు. పరీక్ష ముగిసే వరకు ఫోన్లను స్టేషన్లో ఉంచి విధుల్లో పాల్గొనాలని ఆదేశించారు. పరీక్షకు ముందు బాలికలను తనిఖీ చేస్తున్నారా అని సచివాలయ మహిళా పోలీస్‌లను ఆరా తీశారు. కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సేవలపై ఆయా కేంద్రాల చీఫ్‌లను డీఈఓ అడిగి తెలుసుకున్నారు.


ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసం



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెడ్డిచావిడి వద్దనున్న చౌక్ మసీదులో గురువారం ఆయన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. మసీదులో ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడారు.మసీదు పెద్దలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సుందరకాండ మహాయజ్ఞం



మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో రెండో రోజు గురువారం సుందరకాండ మహా యజ్ఞాన్ని వేద పండితులు యాదవల్లి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ప్రాతఃకాల పూజలు నిర్వహించి సుందరకాండ మహాయజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించి మహామంగళహారతులు ఇచ్చారు.

లారీ రేషన్ బియ్యం స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆటోనగర్ సమీపంలో గురువారం రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. బనగానపల్లికి చెందిన వెంకటేశ్వర్లు , వెంకటరంగయ్య నంద్యాల పట్టణంలో గురువారం 280 సంచుల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి లారీలో బనగానపల్లికి తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. స్థానిక ఆటోనగర్ వద్ద లారీని నిలిపి విచారించగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి తాలూకా పోలీసులకు అప్పగించారు. వెంకటేశ్వర్లు, వెంకటరంగయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పెరిగిన 'ఉపాధి' వేతనం

- రూ.15 పెంపుతో రూ.272కు చేరిన వేతనం
- ఈ నెల నుంచే అమలులోకి
- నియోజకవర్గంలో 95.589 కూలీలు



క్రిష్టిపాడులో ఉపాధి పనుల అనంతరం నిండు కుండలా కుంట



దొర్నిపాడు వద్ద ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు

దొర్నిపాడు: వలసల నివారణే ధ్యేయంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం గ్రామీణులకు వరంగా మారింది. గతంలో కన్నా పనులు ఎక్కువగా లభిస్తుండటంతో దాదాపుగా వలసలు తగ్గుముఖం పట్టాయి. పురుషులతో పాటు మహిళలకు సమాన వేతనం లభిస్తుండటంతో పనులకు మహిళా కూలీలు ఆసక్తి చూపుతున్నారు. గతంలో వేసవి కాలంలో పని భారం అధికం కావడంతో హాజరు పెంపునకు పరిమితి కాలానికి అదనపు నగదు ప్రోత్సాహం ఇచ్చేవారు. ప్రస్తుతం పాత విధానానికి స్వస్తి పలికి రూ.272 వేతనం అమలు చేశారు. ఇంతకు ముందు గరిష్టంగా రూ.257 ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ మొత్తాన్నికి రూ.15 పెంచి అందజేస్తున్నారు. ఈ నెల నుంచి వేతనదారులకు పెరిగిన వేతనం అందించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జలసంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సాగునీటి కాలువల్లో పూడికతీత, ఫాంపాండ్స్, చిన్న తరహా నీటికుంటలు తదితర పనులు చేస్తున్నారు. ముఖ్యంగా ఫాంపాండ్స్ పనుల వల్ల భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. వీటిలో నిల్వ ఉన్న నీరు రైతులకు వ్యవసాయ పనులకు ఉపయోగ పడుతున్నాయి.

మండలాల వారీగా కూలీల వివరాలు

మండలం	జాబ్‌కార్డుల సంఖ్య	పురుషులు	మహిళలు	మొత్తం కూలీలు
ఆళ్లగడ్డ	9,013	8,580	9,098	17,678
చాగలమర్రి	8,475	7,650	8,304	15,954
దొర్నిపాడు	6,431	6,287	6,306	12,593
రుద్రవరం	9,474	8,886	9,245	18,131
శిరివెళ్ల	9,840	9,789	9,951	19,740
ఉయ్యాలవాడ	6,075	5,579	5,914	11,493
మొత్తం	49,308	46,771	48,818	95,589

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పిస్తున్నాం



జాబ్‌కార్డు కల్గిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ప్రతి వారం సమావేశంలో సిబ్బందికి సూచనలిస్తున్నాం. పెరిగిన వేతనాలను కూలీలకు వివరించి ప్రభుత్వం నియమించిన కొలతల మేరకు పనిచేస్తే రూ.272 వేతనం లభిస్తుంది. అలాగే కూలీల సంఖ్య పెరిగేలా చూస్తున్నాం.
– నాగఅనసూయ, ఎంపీడీఓ, దొర్నిపాడు

విరామం లేకుండా పనులు కల్పించాలి



ఈసారి రైతు పనుల్లో కూలి రోజుకు రూ.400 వరకు ఇచ్చారు. ప్రస్తుతం ఉపాధి వేతనం కూడా రూ. 272 పెంచారని తెలిసింది. ఎండకాలంలో ఇతర పనులు ఉండవు కావున మాకు ఉపాధి పనులే అండగా నిలుస్తున్నాయి. ఎలాంటి విరామం లేకుండా పనులు కల్పిస్తే బాగుంటుంది.
– మరియమ్మ, ఉపాధి కూలీ, క్రిష్టిపాడు,

కూలి పెంచడం సంతోషం



ప్రస్తుతం మాకు ఉపాధి పనులే దిక్కు. మరో నాగులు నెలల పాలు వ్యవసాయ పనులుండవు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.257 కూలీ ఇచ్చేది. దీనికి అదనంగా రూ.15 పెంచిందని అధికారులు చెప్పారు. సంతోషంగా ఉంది. ఎండలో పని చేయాలంటే ఇబ్బంది కరమే. ప్రభుత్వం పరిస్థితులను గమనించి కూలి మొత్తం కేటాయించాలి. అలాగే ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పిస్తే బాగుంటుంది.
– సత్యం, ఉపాధికూలి, డబ్ల్యూ.గోవిందిన్నె

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(సిటీ): వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. గురువారం పలు వార్డుల్లో పర్యటించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ మధుకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాయలూరులో ఉచిత వైద్యశిబిరం

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామంలో నంద్యాల శాంతిరాం వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 160 మందికి జ్వరం, దగ్గు, షుగర్ , కీళ్లనొప్పులు, తదితర వ్యాధులకు సంబంధించి వైద్యులు వినయ్‌గౌడ్, హర్షవర్ధన్, మౌనిక, అభిషేక్‌రెడ్డి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కీళ్ల నొప్పులు, కంటి వ్యాధితో బాధపడుతున్న 25 మందికి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి రెఫర్ చేశారు. సర్పంచ్ జనపాల సాయిరెడ్డి పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

దొర్నిపాడు: ఇప్పటి వరకు రైతు భరోసా వర్తించని రైతులు దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు సంబంధించి.. వైఎస్సార్ రైతు భరోసా పథకం రిజిస్ట్రేషన్‌కు పోర్టల్ ప్రారంభమైందని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ గురువారం తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం (1బి), జిరాక్సు, ఆధార్‌కార్డు, రైతు ఫొటో, బ్యాంక్ అకౌంట్ పుస్తకం జిరాక్సు కాపీలతో గ్రామాల్లోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి నమోదు చేయించుకోవాలని సూచించారు.

మహిళల అభ్యున్నతికే పథకాల అమలు



పొదుపు మహిళలకు 'వైఎస్సార్ ఆసరా' మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: మహిళల ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం మూడో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్కాచెల్లెమ్మలందరికీ మంచి చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుంటేనే ఈ పథకాలు అమలవుతాయని, లేకపోతే మళ్లీ అగాధంలోకి కూరుకుపోవాల్సి వస్తుందన్నారు. మండలంలో ఆసరా పథకం కింద రూ. 16.93 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని వివరించారు. మేలు, మంచి చేసే సీఎంను, ఎమ్మెల్యేలను, ఎంపీలను మర్చిపోవద్దని, రానున్న ఎన్నికల్లో మీ అందరు మద్దతు అందించాలని కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే టీడీపీ నాయకులకు ప్రజలు గుర్తుకొస్తారని, అలాంటి వారికి తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. వారి మోసపూరిత మాటలను ఏమాత్రం నమ్మినా మళ్లీ పాతరోజులు పునరావృతం అవుతాయని, రాష్ట్ర అభివృద్ధి తిరోగమనంలోకి నెట్టబడుతుందన్నారు. గోస్పాడులో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను 98శాతం నెరవేర్చిన ఘనత కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అనంతరం స్త్రీశక్తి భవన నిర్మాణం పూర్తి చేయాలని పొదుపు మహిళలు ఎమ్మెల్యే శిల్పా దృష్టికి తెచ్చారు. నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.5 లక్షలు మంజూరు చేసి వెంటనే పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మెగా చెక్కు మహిళలకు అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, సొసైటీ అధ్యక్షుడు ప్రహ్లాద రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, పీపీ మధుసూదన్ రెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శకుంతలమ్మ, మండల అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో ఆదర్శ పాలన



హెచ్‌ఎస్ కొట్టాలలో వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేసి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(రూరల్): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కానాల గ్రామ పంచాయతీ పరిధిలోనున్న హెచ్‌ఎస్ కొట్టాల గ్రామంలో సాయంత్రం అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి మూడున్నరేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే నన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలు చూసి ఓర్వలేక టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, అయినా ప్రజలు వారిని నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు. టీడీపీ హయాంలో లంచం ఇస్తేనే పథకాలు, పనులు చేశారని, ఓట్ల కోసమే గడప తొక్కారని ఆరోపించారు. ప్రస్తుతం జగనన్న పాలనలో 13శాఖల అధికారులతో ఇంటింటికీ వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. నాడు వారి పాలన, నేడు జగనన్న పాలన ఎలా ఉందో బేరీజు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయశేఖర్‌రెడ్డి, సర్పంచ్ బావమ్మ, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ రంగారావు, నాయకులు జగదీష్‌రెడ్డి, అంజి, విశ్వనాథ్, ఆలూరయ్య, వెంకటరామిరెడ్డి, నారాయణరెడ్డి, ప్రసాద్, ఫరూక్, హుసేన్ పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

వైద్య రంగానికి పెద్దపీట

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలను మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలందుతుండగా ప్రస్తుతం ఇంటి వద్దకే వైద్య సేవలందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టిందని, మారుమూల గ్రామీణ ప్రజలకు ఇంటి దగ్గరే కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని 13 ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నెలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఆవరణలో నూతన ఫ్యామిలీ ఫిజీషియన్ (104) వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీ రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, శిరివెళ్ల ఎంపీపీ వసీం ఉన్నారు.

నీటి ఎద్దడిని నివారించండి

నంద్యాల(సిటీ): వారం రోజులుగా తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నీటి ఎద్దడి లేకుండా చూడాలని పట్టణంలోని 30వ వార్డు విజయనగర్ కాలనీ, బొమ్మలసత్రం, క్రాంతినగర్ ప్రాంతాల మహిళలు కోరారు. ఈ మేరకు గురువారం వారు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి నీటి సమస్య తీర్చాలంటూ వినతి పత్రం అందజేశారు. అనంతరం కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఇంటి ఆదినారాయణ హాజరై బీజేపీ జెండా ఆవిష్కరించారు. శివారెడ్డి, గంగాధర్, మనోహర్‌నాయుడు, బలరాం, బ్రహ్మయ్యచారి పాల్గొన్నారు.

రైలు వచ్చే వరకు ఎండలో మగ్గాల్సిందే!



మూల సాగరం రైల్వే గేటు వద్ద రైలు రాక కోసం మండుటెండలో ఎదురుచూస్తున్న వాహదారులు

నంద్యాల(రూరల్): రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నంద్యాలలో నమోదు అవుతున్నప్పటికీ అధికారులు మాత్రం ప్రజలకు సౌకర్యాలు కల్పించకపోతున్నారు. పట్టణంలోని మూల సాగరం, నంద్యాల శివారులోని పొన్నాపురం, బొమ్మలసత్రం రైల్వే గేటు వద్ద రైలు వచ్చే సమయంలో గేట్ వేస్తారు. ఈ క్రమంలో రైలు వెళ్లే వరకు వాహనదారులు, పాదాచారులు ఎండలోనే వేచి చూడాల్సి వస్తోంది. గురువారం మధ్యాహ్నం 1:40 నిమిషాలకు రైలు వస్తుందని గేట్‌మేన్ గేట్‌వేశారు. 20 నిమిషాలు దాటినా రైలు రాలేదు. అయితే మండుటెండలో స్కూటీపై నిలుచున్న ఓ మహిళ కళ్లు తిరిగి పడిపోయింది. గమనించిన స్థానికులు మహిళను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైలు రావడం రద్దయిందో ఏమో కానీ మరో 5 నిమిషాలకే గేటును గేట్‌మేన్ తెరిచారు. ఉద్యోగి, రైల్వే అధికారుల తీరుపై వాహనదారులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. రైల్వే గేట్ల వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేసి వాహనదారుల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పేదల అభివృద్ధి కోసమే పథకాలు

దొర్నిపాడు: పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని సహకార సంఘం చైర్మన్ భూమా చెంచిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చాకరాజువేముల గ్రామ సచివాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 28వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాన్ని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనుల గురించి వివరించాలని సూచించారు. సర్పంచ్ పద్మిని, ఎంపీటీసీ షాజహాన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్‌నాయుడు, మార్కెట్‌యార్డు డైరెక్టర్, కన్వీనర్లు వాసు, ఉసేన్‌బాషా, భూమా లక్ష్మీపార్వతి పాల్గొన్నారు.

శిల్పుల సమస్యల పరిష్కారానికి కృషి



శిల్పాలను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

ఆళ్లగడ్డ: శిల్పుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక శిల్ప కళా మందిరాలను సందర్శించి అక్కడ తయారు చేసిన రాతి శిల్పాలు, విగ్రహాలను పరిశీలించారు. శిల్పులతో ఆమె మాట్లాడుతూ హస్త కళాకారులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిల్పులు సూచించిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈమె వెంట కర్నూలు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య ఉన్నారు.

అభివృద్ధి చేసి చూపుతున్నాం



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(సిటీ): పట్టణాన్ని వేగంగా అభివృద్ధి చేసి చూపుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పద్మావతి నగర్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పద్మావతి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని, ప్రధాన రహదారి కావడంతో కొద్దిరోజులు ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే.. పట్టణంలోని 8వ వార్డులో కౌన్సిలర్ తోహిద్, వార్డు ఇన్‌చార్జ్ నిజాం ఆధ్వర్యంలో ఉప్పరి పేట, బాల్కొండ హాల్ వీధిలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, కౌన్సిలర్ బషీద్, పైలెట్, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్ ఉన్నారు.

పకడ్బందీగా 'జగనన్నే మా భవిష్యత్'



గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి వివరించాలని, కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, పట్టణ సచివాలయల కన్వీనర్ గొట్లూరు సుధాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పలు వార్డు సచివాలయాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లకు జగనన్నే మా భవిష్యత్ కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ పార్టీ తరఫున సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలను కలిసి అభిప్రాయాలను తెలుసుకుని నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు నాయబ్‌రసూల్, మాదం మరియమ్మ ఉన్నారు.

రోజువారీ గేట్లు రద్దు చేయాలి

నంద్యాల(సిటీ): తోపుడు బండ్లు, గంపలతో వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న చిరువ్యాపారుల నుంచి ప్రతి రోజూ గేట్ల రూపంలో డబ్బులు వసూలు చేయడాన్ని రద్దు చేయాలని నంద్యాల చిరువ్యాపారుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త, కార్యదర్శి మదార్‌వలి కోరారు. పట్టణ చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చిరువ్యాపారులకు ప్రభుత్వం వసతి కల్పించిన తరువాతే పన్నులు వసూళ్లు చేసేందుకు మున్సిపాలిటీకి అధికారం ఉందని, రహదారికి ఇరువైపులా వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులపై గేట్ల రూపంలో డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఆకుమళ్ల రహీం, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ ఇన్సెంటివ్స్ విడుదల చేయాలి

నంద్యాల(రూరల్): డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో సీహెచ్‌ఓలుగా పని చేస్తున్న ఉద్యోగులకు జీతంతో పాటు, ఇన్సెంటివ్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏపీ ఎంఎల్‌హెచ్‌పీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుజాత కోరారు. గురువారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ వెంకటరమణకు సీహెచ్‌ఓల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ గత ఏడాది నుంచి ఇన్సెంటివ్స్ విడుదల కాకపోవడంతో సీహెచ్‌ఓలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ అహ్మద్ బాషా, ట్రెజరీ దివ్యశ్రీ, జాయింట్ సెక్రటరీ శివకృష్ణ, సభ్యులు మధు,కృష్ణ, మల్లేశ్వరి, స్రవంతి, రోహిణి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీఓ

ఆళ్లగడ్డ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిబంధనల మేరకు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. మండల కేంద్రం చాగలమర్రిలో 24 గంటల పీహెచ్‌సీని సాయంత్రానికి మూసి వెళ్తున్నారనే సమాచారంతో గురువారం ఎంపీడీఓ భాగ్యలక్ష్మితో కలిసి పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ 24 గంటల ఆసుపత్రిని కేవలం 7, 8 గంటల ఆసుపత్రిగా మర్చడం తగదన్నారు. మండలంలో అనేక పల్లెలు కొండకింద, మారుమూల ప్రాంతాల్లో ఉండటంతోపాటు హైవే విస్తరించి ఉందని.. ఈ క్రమంలో రాత్రి పూట ఏమైనా ఇబ్బందులు జరిగితే వైద్యం అందదన్నారు. కచ్చితంగా 24 గంటలు తెరిచి ఉంచాలని సూచించారు. ఇందుకు వైద్యాధికారులు స్పందిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల అనుమతితో ఇలా కొనసాగిస్తున్నామని చెప్పడంతో వారు కంగుతిన్నారు. విషయం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.